
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.2
**

ANDHRAJYOTHY



సూర్యాపేట

3

గురువారం 11 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.90 (121.5462)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.49 (2.67)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.42 (0.65)	50	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

- గత తప్పిదాలు పునరావృతం కావద్దని..
- ప్రయాణాలు సులభతరం కావాలని..
- ఏ ఒక్కరూ చనిపోవద్దని విన్నపం
- విస్తరణపై వెల్లువెత్తుతున్న ప్రజల సూచనలు
- అండర్‌పాసింగ్‌లు, బ్రిడ్జిలు, వీయూపీల కోసం డిమాండ్లు
- గ్రీన్ హైవేగా మార్చాలని సూచన

ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లే పరిష్కారం

ఆరు వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ● సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం



చిట్యాల మండలం వెలిమినేడు సమీపంలో ప్రమాదకర క్రాసింగ్

దేశంలో రద్దీ రహదారిగా మారి నిత్యం నెత్తు రోడుతున్న అప్పటి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(9)ని 2009లో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించారు. దారి పెరిగినా రోడ్డుపై ప్రమాదాల దారుణాలు మాత్రం తగ్గ లేదు. వాహన రాకపోకలు పెరగడంతో పాటు నిర్మాణ సమయంలో సాంకేతిక సమస్యలతో పాటు స్థానికుల డిమాండ్లకు తలొగ్గి నిర్మాణం మార్చడంతో ప్రమాదాలు నిత్యకృత్యమ య్యాయి. ఈ తరుణంలో 15 ఏళ్ల తర్వాత మరోసారి వాహన రద్దీకి తగ్గట్టుగా ఈ మార్గాన్ని ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు ప్రణాళికలు కూడా రూపొంది స్తోంది. ఇందుకోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నిత్యన్ గడ్కరిని కలిసి పలుమార్లు విన్నవించారు. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణపై స్థానికుల అభిప్రాయాలు, అవసరాలు, అంచనాలను పరిగణలోకి తీసుకో వాలని కోరుతున్నారు. ఎక్కడా రోడ్డు క్రాసింగ్ లేకుండా ఫ్లైఓవర్లు, అండర్ పాసింగ్‌లు, వీయూపీలు నిర్మించాలని కోరుతున్నారు. గతంలో జరిగిన తప్పులు జరుగకుండా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా ప్రమాదరహితంగా రహదారి నిర్మాణం చేపట్టాలని ఆశిస్తున్నారు.

హైదరాబాద్ - విజయవాడ నగరాల మధ్య ఉన్న జాతీయ రహదారి డెత్ రోడ్‌గా మారింది. జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చి ప్రమా దాలను నివారించాలని పలుమార్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించాను. ఆరు నెలల్లో ఆరులేన్లుగా మార బోతోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా కేవలం 2గంటల వ్యవధిలో చేరవచ్చు.
-కొర్లపహడ్ వద్ద ట్రామాకేర్ సెంటర్ భూమిపూజ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి

వివరాలు 5లో

చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి



ఆచార్యులగూడెంలో మాట్లాడుతున్న జడ్జి శ్యాంసుందర్

చిలుకూరు, జూలై 10 : పౌరులందరూ తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ సూచిం చారు. కోదాడ మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఆచార్యులగూ డెంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ హింస నుంచి మహిళలను రక్షించే చట్టాలను, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టాల్లో వాటికున్న పరిష్కారాలను, ఇతర చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు వివిధ రకాల చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిం చారు. కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎడ్ల నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రాంరెడ్డి, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎస్‌ఐ రాంబాబు, గ్రామ ప్రత్యేకాధికారి సిద్ధార్థ, కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

ఉపాధి ఫలాలు అందితేనే ఉపయోగం

పాలకవీడు, జూలై 10 : ఉపాధిహామీ పథకంలో ప్రతి ఫలాలు చివరి వినియోగదా రులకు చేరితేనే ఉపయోగమని డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌రాజు అన్నారు. పాలకవీడు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉపాధిహామీ సామా జికతనిఖీలో ఆయన మాట్లాడారు. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో కూలీలకు రూ.2,61,83,612 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మస్టర్లలో సంత కాలు లేకపోవడం, డిమాండ్లు లేకుండానే పనుల నిర్వహణ, జాబ్‌కార్డులు అప్‌గ్రేడ్ చేయకపోవడం, తదితర అంశాల్లో లోపాలు గుర్తించినట్లు తెలిపారు. దీంతో సంబంధిత బాధ్యులైన వివిధశాఖల వారి నుంచి రూ.3,39,216లు రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ లచ్చీరాంనాయక్, ఎంపీడీవో లక్ష్మి, ఏపీవో రాజు, స్పెషల్ అధికారులు, కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా

● పటేల్ రమేష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, జూలై 10: పర్యాటక రంగాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేషరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివా సంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నాపై నమ్మకం ఉంచి పర్యాటక అభివృద్ధి శాఖను కేటాయించారని, ఈ బా. ధ్యతను విజయవంతంగా పూర్తిచేస్తానని ఈపదవితో నాబాధ్యత మరింత పెరిగింద న్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలి పారు. జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువులో బోటింగ్‌కు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ ప్రాంతంలో రోపింగ్, మూసీ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు. మంత్రులు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క లకు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డిదామోదర్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి సూర్యాపేటకు రావడంతో జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుండి కొత్తబ స్టాండ్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దరావత్ వెంకన్న, ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, పెద్దిరెడ్డి రాజా, కౌన్సిలర్‌లు షఫిఉల్లా, వెలుగు వెంకన్న, ఎడ్ల గంగాభవాని, నామా అరుణ, వీరమల్లుయాదవ్, జ్యోతి శ్రీవిద్య, డాక్టర్ వూర రామూర్తియాదవ్, ఫరూఖ్, స్వామినాయుడు, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్, సైదిరెడ్డి, సాజిద్‌ఖాన్, పిల్లలరమేష్‌నాయుడు, పాలడుగు పరుశరాం, నేరేళ్ళమధుగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తాయి రైతులపై 'సాద్గుడి' పిడుగు



బత్తాయి సాగులో మూడున్నర లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంతో దేశంలోనే మొదటిస్థా నంలో ఉన్న నల్లగొండ రానురాను అధమ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి నల్ల గొండ జిల్లాలో అంతా కలిసి కనీసం 65వేల ఎకరాల్లో కూడా బత్తాయి విస్తీర్ణం లేదంటే పరి స్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఓవైపు తెగుళ్ల బెడద, మరోవైపు నీటి వనరులు తగ్గడం, దిగుబడి వచ్చినప్పుడు ధర ఉండకపోవడం, ధర ఉన్నప్పుడు దిగుబడి రాకపోవడం వంటి సమస్యలను ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం ఎదుర్కొంటుంది.

● నల్లగొండ

- నాసిరకం మొక్కలతో నిండా మునిగిన రైతులు
- పదేళ్లు కావొస్తున్నా దిగుబడి అంతంతే
- తిరుపతి వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ మొక్కలపై అనుమానాలు
- ఆర్థికంగా దెబ్బతిన్న రైతులు
- న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు
- నమూనాలు సేకరించాలని నాగపూర్ యూనివర్సిటీకి ఉద్యానశాఖ లేఖ

గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం తోటల పెంప కాన్ని ప్రోత్సహించలేదు. డ్రిప్పులను సైతం మంజూరు చేయలేదు. నూతన ప్రభుత్వంలోనూ ఒక ఆయిల్‌పామ్ సాగు మినహా పండ్ల తోటలకు ఎలాంటి ప్రోత్సాహ కం కనిపించలేదు. అయితే వరికి ప్రత్యామ్నాయం గా పండ్ల తోటలపై ఆసక్తి ఉన్న రైతులు బత్తాయి తోటలపై మమకారంతో అక్కడక్కడ బత్తాయి తోటలను పెడుతున్నారు. అయితే హార్టికల్చర్ శాఖ నుం చి ఎలాంటి ప్రోత్సా హకం లేకపోవడంతో రైతులు సొంత పెట్టుబడు లతో ముందుకడుగేస్తుండగా కొం తమంది ఆర్థి కంగా ఉన్న రైతులు నిలదొక్కుకుంటే పేద, మధ్య తర గతి రైతులు మాత్రం పండ్ల తోటల ను పెట్టి నష్టాలు చవిచూస్తున్నా రు. తాజాగా జిల్లాలో నాసిరకం మొక్కలను వేసి గత పదేళ్ల కావొస్తున్నప్పటికీ దిగుబడి రాకపోవడం తో లబోదిబోమంటున్నారు.

నాసిరకంతో కూడిన మొక్కలు

నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి, నల్లగొండ, కనగల్, గుర్రంపోడు, నిడమనూరుకు చెందిన రైతులు గత పదేళ్లక్రితం ఏపీ రాష్ట్రంలోని తిరుపతికి చెందిన డా క్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీలో బత్తాయి మొక్కల నర్సరీనుంచి మొక్కలను కొనుగోలుచేశారు. ఒక్కో మొక్కకు రూ.70నుంచి రూ.80వరకు వెచ్చించి తమ భూముల్లో నాటారు. తిరుపతి యూనివర్సిటీ నుంచి తెచ్చిన మొక్కలు పెరిగి పెద్దగా అయినప్పటికీ కాత నిలబడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతు న్నారు. వాస్తవానికయితే బత్తాయి మొక్కలు నాటిన తర్వాత నాలుగు నుంచి నాలుగున్నరేళ్ల వయస్సు వచ్చే సరికి కాపు రావాల్సి ఉంటుంది. విచిత్రమైన పరిస్థితులు ఏమిటంటే పూత బాగానే ఉంటున్నప్ప టికీ కాత నిలబడటంలేదు. ఉదాహరణకు ఒక్క చెట్టుకు 100 పూలు ఉంటే 80 పూలు రాలిపోవడం గమనార్హం. దీంతో రైతులు ఎటు పాలుపోక అధికా రుల చుట్టూ, శాస్త్రవేత్తల చుట్టూ తిరిగివేసారి పో యారు. అధికారులు, శాస్త్రవేత్తలు తోటలు సందర్శిం చి పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు మందులు కూడా పిచికారీ చేయించారు. పూత మాత్రం నిలబడలేదు. దీంతో రైతుల పరిస్థితి అగ మ్యగోచరంగా మారింది. రాయలసీమలోని తిరుపతి ప్రాంతంలో వైఎస్ఆర్ యూనివర్సిటీ పరిధిలో తిరు పతి, వెంకటగిరి, మహానంది, అనంతపురంలో బత్తా యి మొక్కల రీసెర్చ్ స్టేషన్లున్నాయి. ఈ కేంద్రాల నుంచి రైతులు రంగాపూర్(సాద్గుడి) జాతి బత్తా యి మొక్కలను అత్యధికంగా కొనుగోలు చేస్తుంటా రు. వాస్తవానికయితే యాదాద్రి భువనగిరి, సూర్యా పేట జిల్లాలో పండ్ల తోట రైతుల సంఖ్య తక్కువగా ఉండగా నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు చేసిన రైతులున్నారు. ఆయా కేంద్రాల నుంచి అత్యధికంగా నల్లగొండకు చెందిన రైతులే మొక్కలు సాగు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ యూనివర్సిటీ మొక్కలపై నమ్మకం లేక అనంతపురం, కడపకు చెందిన రైతులు జంబేరారకం మొక్కలు సాగు చే స్తున్నట్లు సమాచారం. స్థానిక రైతులు ఇతర జాతు ల మొక్కలను వేసి బయటపడగా నల్లగొండ జిల్లా రైతులు మాత్రం ఆర్‌సెర్చ్ సెంటర్లపై నమ్మకంతో కొ నుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారని చెప్పవచ్చు.

పదేళ్లుగా కానరాని దిగుబడి

పదేళ్ల తోట పెంచి ఎంతో ఆశలు పెట్టుకున్న రైతులకు అడియాసే మిగిలింది. రంగాపూర్ సాద్గుడి (నిమ్మజాతి వేరుమూలం, బత్తాయి అంటు) రకం మొక్కలు వేసిన రైతులు పదేళ్లనుంచి ఎలాంటి దిగుబడి లేక నష్టాలు చవి చూస్తున్నారు. వాస్తవానికయితే ఒక్కో చెట్టుకు 30 నుంచి 50కిలోల దిగుబడి రావాలి. కానీ 10 కిలోలకు మించి కాయ దిగుబడి రావడంలేదు.

బత్తాయి దిగుబడి రావడం లేదు



తోటలు పెట్టి ఏళ్లు గడుస్తున్నా దిగు బడి రావడంలేదు. దీంతో నష్టాలు వాటిల్లుతున్నాయి. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించి రైతులకు న్యాయంచే యాలి. రంగాపూర్ రకానికి చెందిన మొక్కలు దిగు బడి రాకపోవడంతో ఆ మొక్కలు పెట్టిన రైతులు నష్ట పోయారు. యూనివర్సిటీ మొక్కలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి రైతులను ఆదుకోవాలి.
- శ్రీనివాస్ రెడ్డి, ఎర్రబెల్లి, నిడమనూరు

మాదక ద్రవ్యాల విక్రయాలపై ఉక్కుపాదం

● ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

తుంగతుర్తి / మద్దిరాల / నూతనకల్, జూలై 10 : మాదక ద్రవ్యాల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ పోలీస్‌స్టేష న్లను ఎస్పీ తనిఖీ చేశారు. తుంగతుర్తిలో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారితో పాటు గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణాచేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామ న్నారు. పట్టుబడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడ కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సైబర్‌క్రైంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలతో పోలీసులు మమేకమై అంకితభావంతో పనిచేయాలన్నారు. నూతనకల్ మండలంలో నల్ల బెల్లం, రేషన్ బియ్యం విక్రయాలపై పోలీసులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవికుమార్, సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్‌ఐ ఏడుకొం డలు, మధునాయుడు, జే సైదులు, ఇంటలిజెన్స్ అధికారి రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు

సూర్యాపేట క్రైం: జిల్లాలో రేషన్ బియ్యంతో వ్యాపారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా 10 కేసులు నమోదు చేసి 689 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వారు ఎవరైనా వదిలేది లేదని, కఠినచ ర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమమార్గంలో విక్రయించినా, రీసైక్లింగ్ చేసినా పీడీయాక్ట్ నమోదుచేస్తామ న్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు బియ్యం అందించే మిల్లర్లపై, అంతర్రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్‌పై పోలీసుల నిఘా ఉంద న్నారు. అక్రమ వ్యాపారం చచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

15 కిలోమీటర్లు నడకన కలెక్టరేట్‌కు..

సూర్యాపేట(కలెక్టరేట్) / సూర్యాపేట రూరల్, జూలై 10 : తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని సూర్యాపేట మండలం బాలెంల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థినులు 15 కిలోమీటర్ల మేర నడిచి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట మండలం బాలెంల గ్రామ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయాలని ఆ కళాశాల విద్యార్థులు వారం రోజులుగా ఆందోళన బాటపట్టారు. దీంతో పలువురు అధికారులు విచారణ చేసి శైలజను బదిలీచేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థినులు 200 మంది బుధవారం మరోసారి ఆందోళనకు దిగారు. కళాశాల నుంచి సుమారు 15 కిలోమీటర్ల మేర కాలిన డకన సాయంత్రం 6 గంటలకు కలెక్టరేట్‌కు వెళ్లి ఆం దోళన చేశారు. రాత్రి 10.30 గంటల వరకు ధర్నా కొన సాగింది. ఈ విషయమై అదనపు కలెక్టర్ లత, సూర్యా పేట ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ రవి ఆందోళన విర మించాలని, మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్తామని హామీ ఇచ్చినా విద్యార్థినులు ససేమిరా అన్నారు. కాసేపటి తర్వాత కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కొంత మంది విద్యా ర్థినులను కార్యాలయంలోకి వస్తే విషయాన్ని తెలుసు కొని మరోసారి నివేదికను రాష్ట్ర అధికారులకు పంపి స్తామని చెప్పినా ఆందోళన విరమించకుండా కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. విద్యార్థినుల ఆందోళనకు పలు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కళా శాల ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అదే విధంగా రాష్ట్ర స్థాయి అధికా రులు కళాశాలకు వచ్చిన తర్వాత ప్రిన్సిపాల్ గది తాళం తీస్తామని అప్పటివరకు ఆ గదిని తెరవనీయ మని విద్యార్థినులు స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ శైలజ తన గదిలో వంట సామాగ్రికి సంబంధించిన విలువైన కిరాణ సామాగ్రిని అక్రమంగా నిల్వ చేసుకుందని ఆరో పించారు. రాత్రి 10 గంటల నుంచి సుమారు 40 నిమి షాల పాటు కలెక్టర్, విద్యార్థినులతో చర్చించారు. చివ రకు కలెక్టర్ హామీతో 10.45కు విద్యార్థినులు ఆందోళన విరమించారు.ప్రత్యేక వాహనాల్లో విద్యార్థినులను హాస్ట ల్‌కు పంపించారు.



కాలినడకన కలెక్టరేట్‌కు వెళ్తున్న విద్యార్థినులు, కలెక్టరేట్ ఎదుట రాత్రి 10 గంటల సమయంలో ఆందోళన

విచారణ చేస్తాం, ప్రభుత్వానికి నివేదిస్తాం : కలెక్టర్

ప్రిన్సిపాల్ శైలజపై ఆరోపణలపై విచారణ చేపడ తామని, ఇప్పటికే ఆమెను తాత్కాలికంగా బదిలీ చేశా మని కలెక్టర్ తేజస్ నందలాల్ అన్నారు. ఆందోళన తగదని, చదువుపై దృష్టి సారించాలని విద్యార్థినులకు సూచించారు. అధికారులతో మరోసారి విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని, ఆ తదుపరి చర్యల తీసు కుంటామన్నారు.

ఉదయం కళాశాలను సందర్శించిన కలెక్టర్

బాలెంల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను కలెకెర్ తేజస్ నంద్‌లాల్ పవర్ బుధ వారం సందర్శించారు. కళాశాలలో జరిగిన సంఘట నపై విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సాయం త్రం జరిగే స్టడీఅవర్స్‌పై విద్యార్థినులతో మాట్లాడి వివ రాలను తెలుసుకున్నారు. అనంతరం టీచింగ్ స్టాఫ్ వివరాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సీఈవో శిరీష, ఆర్‌సీవో అరుణకుమారి, సాంఘిక సంక్షేమ అధికారి లత, డీడబ్ల్యూవో వెంకటరమణ తది తరులు పాల్గొన్నారు.



కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రేమ, పెళ్లి పేరుతో యువకుల వేధింపులతో ఆత్మహత్య

మాడ్గులపల్లి, జూలై 10: ఒకే వీధిలో ఉండే ఇద్దరు యువకులు ఓ యువతిని పెళ్లి చేసుకోవాలని ఒకరు, ప్రేమించాలని మరొకరు వేధించారు. తాము చెప్పినట్లుగా వినకపోతే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో యువతి ఫొటోలను పెడతామని బెదిరించడంతో ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శోభన్‌బాబు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం కుక్కడం ఆవాసం చింతలగూడెం గ్రామానికి చెందిన కొత్త రామలింగం రజిత దంపతులకు కుమారుడు, కుమార్తె కల్యాణి(18) ఉన్నారు. కల్యాణి పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. ఆమె స్వగ్రామంలో ఉండే వీధిలోనే ఉండే ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులు కల్యాణిని ఇష్టపడుతున్నారు. వీరిద్దరూ స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట కల్యాణి ఫోన్‌నెంబరును తెలుసుకున్న వారిద్దరూ ఆమెకు తరచూ ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఊరితో పాటు వీధిలో ఉండేవారే కావడంతో ఆమె వారితో మాట్లాడుతోంది. దీనిని అలుసుగా తీసుకున్న శివ తనను ప్రేమించాలని, మధు తనను పెళ్లి చేసుకోవాలని అడుగుతున్నారు. ఇందుకు కల్యాణి నిరాకరిస్తుండటంతో వాట్సాప్‌లో ఆమె డీపీగా(డిస్‌ప్లే పిక్చర్) పెట్టుకున్న ఫొటోలను తీసుకుని వాటిని తమ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరిస్తున్నారు. ఇద్దరు యువకుల వేధింపులతో మనోవేదనకు గురైన కల్యాణి ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. కొద్దిసేపటికి స్థానికులు గమనించి మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తల్లి రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని నల్లగొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. స్వగ్రామంలో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా నిందితులు శివ, మధులు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామన్నారు. కల్యాణి మృతదేహాన్ని సందర్శించిన మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి మృతి పట్ల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ సర్పంచ్ అలుగుబెల్లి గోవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ, నాయకులు పాదూరి గోవర్ధని, రాబర్ట్, నకిరేకంటి శ్రీను, వెంకన్న, వేణు, మారయ్య, నంద్యాల వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


రామలింగంను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కల్యాణి(ఫైల్‌ఫొటో)

కడుపు నొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి

నల్లగొండ క్రైం, జూలై 8 : కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం నాగార్జునపేటకు చెందిన రమావత్ ఇందూ(17) కట్టంగూరు కేజీబీవీలో ఇంటర్ బైపీసీ చదువుతోంది. రెండురోజుల నుంచి కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సకోసం తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబం మూడేళ్ల నుంచి నల్లగొండలోని శ్రీనివాసనగర్‌కాలనీలో నివాసముంటూ కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

చిట్యాల రూరల్, జూలై 10 : ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాక్‌లోని సీతారాంపేటకు చెందిన రామనాథం సాయిరామ్(28) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులు జమ్మన్న సంప్రీత్‌జోషి, తమ్మగోని చరణ్, డ్రైవర్ మీసాల వంశీ వినాయక్‌లతో కలిసి ఈ నెల 9న హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు కారులో వెళ్తున్నాడు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు టైరు పగిలి అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాయిరాంతో పాటు కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా సాయిరామ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి రామనాథం కాళిదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి ...



గరిడేపల్లి, జూలై 10: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన నాగార్జునపు మధు(36) మంగళవారం ఉదయం కోదాడ నుంచి మిర్యాలగూడకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం అప్పన్నపేట శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మధుకి గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మధు భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. మధుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లొంగిపోయిన మనీష్‌రెడ్డి

చింతపల్లి, జూలై 10 : మనీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వెయ్యికి రెండు వేలు, లక్షకు రెండు లక్షలు ఇస్తానంటూ రూ.50 కోట్లతో ఉడాయించిన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మదిని మనీష్‌రెడ్డి పోలీసులకు బుధవారం లొంగిపోయాడు. మొదట కొందరికి నమ్మకం కలిగేలా ఇచ్చిన మనీష్‌రెడ్డి ఆ తర్వాత చేతులెత్తేశాడు. బాధితులు డబ్బుల కోసం నిలదీయడంతో బ్రాంచ్ మూసేసి పోలీసుల వద్ద లొంగిపోయాడు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఆరు వరుసలుగా హైదరాబాద్-విజయవాడ హైవే

ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లే పరిష్కారం

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- గతంలో తప్పులు జరగవద్దంటున్న ప్రజలు
- అండర్‌పాసింగ్‌లు, వీయూపీలు, ఫ్లైఓవర్లతో క్రాస్‌రోడ్ల సమస్యలకు పరిష్కారంగా సూచన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి(65)ని ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి మొదలై సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వరకు 151 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో హైవేను విస్తరించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక నిర్మాణాలతో పాటు సర్వీస్ రోడ్లను కూడా నిర్మించి ఇబ్బందులను తీర్చాలని సమీప గ్రామాల ప్రజల డిమాండ్ చేస్తున్నారు. జంక్షన్లు, క్రాస్‌రోడ్ల వద్ద ఫ్లైఓవర్లతో పాటు అండర్‌పాసింగ్‌లను ఏర్పాటు చేయాలంటున్నారు.


హైవే ప్రారంభం వద్ద చౌటుప్పల్ మండలంలో ఆంథోల్‌మైసమ్మ దేవాలయం

చౌటుప్పల్ టౌన్ / చౌటుప్పల్ రూరల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి యాదాద్రి భువనగిరి జిల్లాలో 23 కిలోమీటర్లు విస్తరించి ఉంది. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామసమీపంలోని 40వ కిలోమీటరు రాయి సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి నుంచి గుండ్లబావి గ్రామసమీపంలోని 63వ కిలోమీటరు రాయి వరకు ఉంటుంది. చౌటుప్పల్ పట్టణం మీదుగా వెళ్లే ఈ హైవేపై ఎల్లంబావి, లక్కారం గ్రామాల్లో ఫ్లైఓవర్లు, దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి ఆరులేన్లతో నిర్మించి ఉన్నాయి. వీటి పరిధిని తీసివేస్తే నిర్దిష్టంగా 20 కిలోమీటర్ల పొడవున ఆరు వరసలుగా విస్తరించవలసి ఉంటుంది.

రెండు ఆలయాలు, ఒకదర్గా

హైవే విస్తరణకు రెండు దేవాలయాలు, ఒక దర్గా అడ్డంకిగా ఉన్నాయి. దండు మల్కాపురం సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం, చౌటుప్పల్ పట్టణంలో దర్గా, ఎల్లంబావి గ్రామ సమీపంలో గణేష్ టెంపుల్ ఉన్నాయి. వీటిని పక్కకు కదిలించాల్సి రావడం ఇబ్బందితో కూడుకున్న పని.

దండు మల్కాపురం వద్ద...

ఆరులేన్ల విస్తరణతో వాహనాల వేగం పెరగనుంది. ఈ క్రమంలో పలు చోట్ల అండర్‌పాసింగ్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. నిత్యం వేలాది కార్మికులు రాకపోకలు సాగించే పారిశ్రామిక కారిడార్ దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి అవసరం ఉంది. పారిశ్రామిక వేత్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కే సుధీర్‌రెడ్డి ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను కలిసి ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వినతిపత్రాలను అందజేశారు. ఈ సర్కిల్ వద్ద గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్, ఆంథోల్ మైసమ్మ దేవాలయం, దండు మల్కాపురం గ్రామం ఉంది. ఇక్కడి నుంచి దేవాలయానికి సుమారు 200 మీటర్ల పొడవున వ్యతిరేక మార్గంలో భక్తులు వెళ్తుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. కార్మికులు, ఉద్యోగులు, గ్రామస్థులు హైవేను దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ ఏర్పాటు ఎంతో అవసరం ఉంది.

అండర్‌పాసింగ్‌లు లేక

హైవేపై దండుమల్కాపురం, కైరతాపురం, ఎల్లగిరి, ధర్మాజీగూడెం, పంతంగి, ఆరెగూడెం గ్రామాలకు వెళ్లే దారుల వద్ద అండర్‌పాసింగ్‌లను నిర్మించాలని ప్రజలు పదేళ్లగా కోరుతున్నారు.

చౌటుప్పల్‌లో భారీ ఫ్లైఓవర్

చౌటుప్పల్ పట్టణంలో 2.45 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి నుంచి పద్మావతి ఫంక్షన్ హాల్ వరకు నిర్మాణం జరగనుంది.ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి.

ఆరు లేన్ల విస్తరణతో పాటు సర్వీసు రోడ్లు నిర్మించాలి



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని నిర్ణయించడం అభినందనీయం. ఆరు లేన్ల రోడ్డుతో పాటు జాతీయరహదారి మొత్తం సర్వీసు రోడ్లు, డ్రైనేజీ కాల్వలను నిర్మించాలి. ప్రమాద ప్రాంతాలలో పబ్లిక్ అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలి. రహదారిని గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా మార్చాలి.

● రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లగిరి



చిట్యాల / చిట్యాల రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం రెడ్డిబావిగూడెం వరకు ఉన్న హైవే ఆ తర్వాత నుంచి నల్లగొండ జిల్లా చిట్యాల పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి వట్టిమర్తి క్రాస్‌రోడ్డు వరకు చిట్యాల మండల పరిధిలో సుమారు 21 కిలోమీటర్లక మేర విస్తరించి ఉంది. గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాల్లో ఆరు లేన్ల విస్తీర్ణంతో గతంలోనే బ్రిడ్జిలను నిర్మించారు. ప్రధానంగా గుండ్రాంపల్లి, సుర్కంటిగూడెం, వెలిమినేడు శివారు, పెద్దకాపర్తి, చిట్యాల జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్, వట్టిమర్తి క్రాస్‌రోడ్ ప్రాంతాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను నిర్మించాల్సి ఉంది. అదేవిధంగా చిట్యాలలోని బస్టాండ్ సమీపం నుంచి ఎస్‌బీఐ కార్యాలయం వరకు ఫ్లైఓవర్ మంజూరు కాగా ఇటీవల మంత్రి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు.

వెలిమినేడు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారి విస్తరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆలయ నిర్వాహకులు, స్థానికులతో సమావేశమై తుది నిర్ణయానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.

ఎనిమిది లేన్లుగా విస్తరించాలి



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి. విపరీతమైన ట్రాఫిక్ ఉన్నందున భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి అలాగే మెట్రో రైలు వేయడం వల్ల హైవేపై ట్రాఫిక్ తగ్గుతుంది. చిట్యాలలో బైపాస్ నిర్మించాలి.

- కుక్కల మోహన్, చిట్యాల వాసి

ప్రమాదంగా మూలమలుపు



నార్కట్‌పల్లి: చిట్యాల మండలం వట్టిమర్తి దాటగానే మొదలై ఏపీ లింగోటం వరకు నార్కట్‌పల్లి మండలంలో హైవే సుమారు 10.7 కిలోమీటర్ల విస్తరించి ఉంది. నార్కట్‌పల్లి పట్టణంలో నుంచే కాకుండా బైపాస్‌గా హైవేని విస్తరించారు. నార్కట్‌పల్లి పట్టణం ప్రారంభం నుంచి కామినేని చివరి వరకు, ఆ తర్వాత ఏపీ లింగోటం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే అద్దంకి రాష్ట్ర రహదారికి పైనుంచి జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మించారు. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్లాల్సిన వాహనాలు ప్రస్తుతం ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి నల్లగొండ వైపునకు తిరిగే సమయంలో కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

రింగ్ రోడ్డును నిర్మించాలి

నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద రింగ్ రోడ్డును నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. కామినేని నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా నార్కట్‌పల్లి పట్టణం వైపునకు వచ్చే క్రమంలో ఫ్లైఓవర్ కింద నుంచి కుడి వైపునకు వెళ్లాల్సిన సమయంలో ఇటు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుతో పాటు నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే వాహనాలు అటు నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు హైవేపైకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డుపైకి ఎక్కే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ ప్రదేశాన్ని విస్తరించి రింగ్‌రోడ్డు వేయడం ద్వారా ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

'రోటరీ'రోడ్డు ప్రతిపాదనలను పరిశీలించాలి

నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే దారిలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద 'రోటరీ రోడ్డు'ను ఏర్పాటుచేసేందుకు గతంలో జీఎంఆర్ సంస్థ ప్రతిపాదనలు పంపగా జాతీయ రహదారి సంస్థ నిరాకరించింది. కామినేని ఆసుపత్రి సమీపంలోని వైజంక్షన్ వద్ద పదుల సంఖ్యలో మృత్యువాత పడగా ఈ ప్రదేశాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు హైదరాబాద్ ఓఆర్‌ఆర్ వద్ద ఉన్నట్లుగానే 'రోటరీ' రోడ్డును నిర్మించేందుకు జీఎంఆర్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు అప్పట్లో అంగీకారం లభించలేదు. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన కామినేని ఆసుపత్రి వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జికే ఆమోదం తెలిపి నిర్మించారు. ఐతే ప్రస్తుతం ఆరులేన్ల విస్తరణ పనుల్లో భాగంగా నార్కట్‌పల్లి బ్రిడ్జి వద్ద రోటరీ రోడ్డు ఏర్పాటు అంశం మరోసారి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

● భూసేకరణ అవసరం లేదు

హైవే విస్తరణకు భూసేకరణ అవసరం లేదు. 2009లో చేసిన నాలుగు వరసల రోడ్డు విస్తరణ సందర్భంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూసేకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా 100 మీటర్ల మేర భూమిని ప్రభుత్వం సేకరించింది. దీంతో ఆరు వరసలు రోడ్డు విస్తరణకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఆస్తుల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.



● పచ్చదనం కనుమరుగు

ఆరులేన్ల విస్తరణతో వేలాది చెట్లు నేలమట్టం కానున్నాయి. హైవే విస్తరణ నేపథ్యంలో చెట్లను తొలగించాల్సి ఉంది. హరితహారం కింద నాడు నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారి హైవేను పచ్చదనంతో నింపివేశాయి. మూడు వరసలలో పెరిగిన చెట్లలో రెండు వరసలను తొలగించవలసి ఉంటుంది.

ప్రమాదాలకు జంక్షన్ కట్టంగూరు

కట్టంగూరు: నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం దాటిన తర్వాత నుంచి అయిటిపాముల శివారు వరకు హైవే కట్టంగూరు మండలపరిధిలోకి వస్తుంది. సుమారు 17 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కట్టంగూరు శివారు నల్లగొండ క్రాస్‌రోడ్ జంక్షన్ ప్రమాదాలకు జంక్షన్‌గా మారింది. ఈ ప్రదేశం వద్ద వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించాల్సి ఉంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలకు తోడుగా నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి వచ్చే వాహనాలు ఈ జంక్షన్ వద్దే కలుస్తాయి. దీంతో ఈ జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రదేశం వద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుచేసినా గాని ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకోసం ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు అదేవిధంగా సర్వీసు రోడ్లను పూర్తి చేయాల్సి ఉంది. ఇదిలా ఉడగా ముత్యాలమ్మగూడెం, కట్టంగూరు, అయిటిపాముల బ్రిడ్జిల కిందట ఏర్పాటుచేసిన పీయూపీలను వీయూపీలుగా మార్చాల్సిన అవసరముందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా కట్టంగూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పీయూపీ చాలా ఇరుకుగా ఉండటంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఇదే విషయమై గ్రామానికి చెందిన ప్రజలు అనేకసార్లు రహదారిపై రాస్తారోకో చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరిస్తున్న క్రమంలో పీయూపీని విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు.


కట్టంగూరు శివారులోని నల్లగొండ క్రాస్‌రోడ్డు

అండర్‌పాసింగ్‌తో పరిష్కారం



కట్టంగూరు శివారులోని జంక్షన్ వద్ద అండర్‌పాసింగ్ ఏర్పాటుతోనే సమస్యకు పరిష్కారం. వీయూపీని నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చు. ఈ ప్రదేశం వద్ద రింగురోడ్డు నిర్మించినా ప్రమాదాలను నివారించలేం. దీంతో పాటు కట్టంగూరులో పీయూపీలను కూడా వెడల్పు చేయాలి.

- గట్టిగోర్ల సత్తయ్య, మాజీ ఎంపీటీసీ కట్టంగూరు

నకిరేకల్: నకిరేకల్ మండలంలో చందంపల్లి గ్రామం నుంచి కేతేపల్లి మండలం ఇనుపాముల జంక్షన్ వరకు మూడు కిలోమీటర్ల దూరం హైవే రోడ్డు ఉంటుంది. నకిరేకల్ బైపాస్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ నుంచి నకిరేకల్ పట్టణానికి వాహనాలు రావాల్సి ఉంది. ఈ రెండు జంక్షన్ల వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు లేన్ల రోడ్డు విస్తరణ ఏర్పాటు చేస్తే సుమారు అర కిలోమీటర్ దూరం నకిరేకల్‌లోని చీమలగడ్డ ప్రాంతంలో నాలుగు లేన్ల పక్క ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం కానున్నాయి. అదేవిధంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాఫీగా జరుగుతుంది.

కేతేపల్లి : నకిరేకల్ పట్టణ శివారు నుంచి మూసీ నది పక్కన గల ఉప్పలపహాడ్ గ్రామం వరకు కేతేపల్లి మండలంలో దాదాపు 13 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. ఈ హైవేపై ఇనుపాముల-నకిరేకల్ పట్టణాల మధ్య గల జంక్షన్ బ్లాక్‌స్పాట్‌గా ఉంది. అలాగే కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల వద్ద గల జంక్షన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ జంక్షన్‌ల వద్ద స్థానిక ప్రజానీకం కాలినడక వెళ్లడం, జీవాలు, పశువులు రోడ్డు దాటడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. అన్ని గ్రామాల్లో అండర్ పాసింగ్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. దీంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు హైవేపై మీదకు వెళ్లడం కుదరదు. దూర ప్రాంతాలకు అత్యంత వేగంగా వెళ్లే వాహనాలకు సైతం గ్రామాల వద్ద ఎలాంటి అడ్డంకులు లేకుండాపోనున్నాయి.



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామం దాటిన తర్వాత సూర్యాపేట జిల్లా పరిధిలోకి హైవే వెళ్తుంది. సూర్యాపేట పరిధిలోని రాయినిగూడెం నుంచి దురాజ్‌పల్లి వరకు 10 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. సూర్యాపేట పట్టణం కొత్త బస్టాండ్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వరకు ఆరు లేన్ల బ్రిడ్జి నిర్మించారు. పిల్లలమర్రి, జనగాం ఎక్స్‌రోడ్డు, దురాజ్‌పల్లి వద్ద ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయాచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రధానంగా జనగాం క్రాస్‌రోడ్డు వద్ద వందలసంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రాత్రివేళ రోడ్డు దాటుతున్న పాదచారులతో పాటు వాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. రాత్రివేళ ఇక్కడ రోడ్డుదాటడం అంటేనే ప్రజలు భయపడుతుంటారు. సూర్యాపేట పట్టణం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కిలోమీటర్ సర్వీస్ రోడ్డు నిర్మిస్తే మూడు టౌన్‌షిప్‌లతో పాటు కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు ఎటువంటి భయాందోళన లేకుండా ప్రయాణం చేయవచ్చు. కిలోమీటరు దూరంలో ఉన్న టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ప్రజలు, కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు రాత్రి పూట కొద్ది దూరమేనని రాంగ్ రూట్‌లో రావడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దురాజ్‌పల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సిఉంది. ప్రస్తుతం నేరేడుచర్ల రహదారి వైపునకు వాహనాలు మళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదేకాక జమ్మిగడ్డ సబ్‌స్టేషన్ దగ్గర ఉన్న జాతీయ రహదారి కుడి వైపు నుంచి కేవలం అరకిలోమీటర్ లోపు రోడ్డు నిర్మిస్తే చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగర్, విజయకాలనీ, దాసాయిగూడెం, ఇమాంపేట, బలరాంతండా, దుబ్బతండా, వస్త్రాంతండా, లేఖ్యతండా, ఇండస్ట్రీయల్ ఏరియాలో పనిచేసే కార్మికులు ఎఫ్‌సీఐలో పనిచేసే కార్మికులకు వెసలుబాటుగా ఉంటుంది.


ముద్దులచెర్వు వద్ద అండర్‌పాస్ నిర్మించాల్సిన ప్రదేశం

మూలమలుపులతో, మూగజీవాల రాకతో, క్రాస్‌రోడ్లతో మునగాల మండలంలో హైవే ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. మృతుల్లో నందమూరి జానకిరాంతో పాటు ఏపీకి చెందిన ఎస్పీ, ఇతరులు ఉన్నారు. మునగాల మం డల పరిధిలోని హైవేలో సుమారు 16కు పైగా మూల మలుపులు ఉన్నాయి. ఆరులేన్ల విస్తరణలో ఈ మలుపు లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనచోద కుడు అలసిపోయేలా ఈ మార్గంలో ప్రయాణం ఉంటుంది.

మునగాల: మండలంలోని కొమరబండ తర్వాత కోదాడ మండలం కట్టకొమ్ముగూడెం నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వద్దకు హైవే విస్తరించింది. 10 కిలోమీటర్ల విస్తరించి ఉన్న హైవేపై ఆరు లేన్ల కోదాడ పట్టణంలోని దొరకుంట గ్రామంలో ఆరులేన్ల రహదారి ఉంది.కట్టకొమ్ముగూడెం, రామాపురం క్రాస్‌రోడ్లను ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. కోదాడ మండలంలోని ద్వారకుండ జంక్షన్, జంక్షన్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టకొమ్ముగూడెం రోడ్డు, అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరంగపురం, శ్రీరంగపురం నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న దుర్గపురం జంక్షన్, జంక్షన్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోఉన్న చిమిర్యాల, చిమిర్యాల స్టేజీ నుంచి కిలోమీటర్ దూరంలోని నల్లబండగూడెం, అక్కడ నుంచి మరో కిలోమీటరు దూరంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాగా కట్టకొమ్ముగూడెం రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉందని, మిగతా స్టేజీల్లో అండర్‌పాస్‌లను నిర్మిస్తే ప్రమాదాలు జరగవని వాహనదారులు పేర్కొంటున్నారు.

కోదాడ: చివ్వెంల మండలం గుంజలూరు దాటిన తర్వాత మునగాల మండలంలోకి హైవే ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి కొమరబండ బైపాస్ వరకు సుమారు 25 కిలోమీటర్ల హైవే విస్తరించి ఉంది. మాధవరం, తాడ్వాయి, మొద్దులచెర్వు, కలకోవ, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. మునగాల, బరాకత్‌గూడెం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. మాధవరం వద్ద యూటర్న్ లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మాధవరం నుంచి నాలుగు మీటర్ల దూరంలో ఉన్న మొద్దులచెర్వు, తాడ్వాయి, కలకోవల క్రాస్‌రోడ్ల వద్ద, అక్కడ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మునగాల పట్టణంలోని క్రాస్‌రోడ్డు, అక్కడి నుంచి ఐదు మీటర్ల దూరంలో ఉన్న ముకుందాపురం క్రాస్‌రోడ్డు, ఆ తర్వాత మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుపాముల క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా అండర్‌పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల అభిప్రాయాలు తీసుకోవాలి



హైవేపై అవసరమైన చోట అండర్‌పాసింగ్‌లు నిర్మిస్తే ప్రమాదాలను నిరివారించవచ్చు. ఆరు లేన్ల విస్తరణ సందర్భంగా రహదారి వెంట గ్రామస్థుల అభిప్రాయాలను తీసుకోవాలి. ఖమ్మం-సూర్యాపేట రహదారి విస్తరణలా చేపడితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. జాతీయరహదారిపై ఉన్న ప్రతీ గ్రామం వద్ద తప్పనిసరిగా అండర్‌పాసింగ్‌లు నిర్మించాలి.

- కనగాల నాగేశ్వరరావు, కోదాడ


దురాజ్‌పల్లి జంక్షన్

చివ్వెంల : సూర్యాపేట పట్టణ శివారు దాటిన తర్వాత చివ్వెంల మండలంలో 12 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. వస్త్రాంతండా మొదలుకొని గుంజలూరు గ్రామం శివారు వరకు ఉన్న హైవేపై వస్త్రాంతండా వద్ద రహదారి నుంచి తండా వైపునకు వెళ్లేందుకు జంక్షన్ లేక వ్యతిరేకమార్గంలో వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఉండ్రుగొండ గ్రామ స్టేజీ వద్ద కాకుండా కొంచెం దూరంగా జంక్షన్ ఏర్పాటు చేయడంతో వ్యతిరేక మార్గంలో గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తుల్జారావుపేట గ్రామ స్టేజీ వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గుంపుల వద్ద మరో జంక్షన్ ఏర్పాటుచేస్తే గ్రామస్థులకు ఇబ్బందులు తీరుతాయి. వస్త్రాంతండా, దురాజ్‌పల్లి, ఉండ్రుగొండ, పెద్దగట్టు లింగమంతులస్వామి దేవస్థానం నుంచి కాసీంపేట వరకు, తుల్జారావుపేట గ్రామాల వద్ద సర్వీసు రోడ్లతో పాటు ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామాపురంలో రింగ్‌రోడ్డు కావాలి

కోదాడ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో చివరి ప్రాంతం హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఉన్న కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు. ఇక్కడ రింగ్‌రోడ్డు నిర్మించాలని స్థానికులు రోడ్డు విస్తరణ సమయంలోనే పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ వీలుకాలేదు. అప్పటి నుంచి ఈ ప్రాంతం నాలుగు కూడళ్ల ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. నిత్యం సుమారు 10కి పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగడంతో పాటు అనేక మంది మృత్యువాతకు గురవుతున్నారు. సమీపంలోని సిమెంట్ పరిశ్రమలకు సంబంధించి వందలాది లారీలు ఈ రహదారి వెంటే వెళ్తుంటాయి. దీంతో రద్దీ ఉంటుంది. ఇటీవల మూడు నెలల్లో జరిగిన 13 రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా ఆరు లేన్ల విస్తరణలో భాగంగా రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద భారీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు సమాచారం.

రింగ్ రోడ్డు అవసరం



ఆరులేన్ల హైదరాబాద్-విజయవాడ రహదారిని ప్రమాదరహితంగా నిర్మించాలి. గతంలో జరిగిన సాంకేతిక సమస్యలకు ఆస్కారం ఇవ్వొద్దు. రహదారి వెంట గ్రామీణ ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా రింగ్‌రోడ్డు, సర్వీసు రోడ్లు నిర్మించాలి.

- కమతం వెంకటయ్య, రైతు

ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిందేనా?



మండల కేంద్రం నుంచి దొనబండతండాకు వెళ్లే రోడ్డులో వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. ఇవి కుళ్లి భరించరాని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడతున్నారు.

- మఠంపల్లి

మఠంపల్లి నుంచి దొనబండతండా రోడ్డు పక్కనే ఉన్న వ్యర్థాలు

- మఠంపల్లి -దొనబండతండా రోడ్డులో వ్యర్థాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు

మండల కేంద్రం నుంచి దొనబండతండా, అల్లీపురం, కొత్తతండా, భీల్యానాయక్‌తండా, యాతవాకిళ్ల, హనుమంతులగూడెం, అవిరెనికుంటతండా తదితర తండాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు పక్కనే కూరగాయలు, మెడికల్, చికెన్, పండ్ల దుకాణాదారులు వ్యర్థాలను పడేస్తున్నారు. హోటళ్లు, కొబ్బరిబోండం, దుకాణాదారులు వ్యర్థాలను మండల కేంద్రం సమీపంలోని తీగల్ చెర్వు వద్ద రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో మఠంపల్లి బైపాస్ రోడ్డుతో పాటు చేపల మార్కెట్ బజారులో భరించరాని దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈవిషయానికి పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించు కోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ దారి మూడు మండలాల్లో 20 తండాలనుకలుపుతూ రేయింబవళ్లూ రద్దీగా ఉంటుంది. ఉన్నతాధికారుల స్పంచదింది. అల్లీపురం రోడ్డు నుంచి తీగల్ చేర్వు వరకు రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



మండల కేంద్రం నుంచి దొనబండ తండా వెళ్లే రహదారిలో తీగల్‌చెర్వు వద్ద భరించలేని దుర్వాసన వస్తోంది. దుకాణదారులు వ్యర్థాలను ఇష్టారాజ్యంగా రోడ్డు పక్కనే పడేస్తున్నారు. కాల్చకుండా వదిలేయడంతో దుర్వాసనను భరించలేక పోతున్నాం.

- బానోతు నాగేశ్వరావునాయక్, దొనబండతండ

నోటీసులు ఇస్తాం

మండల కేంద్రం సమీపంలోని తీగల్ చెర్వు ప్రాంతంలో రోడ్డు పక్కనే వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నవారికి నోటీసులు ఇస్తాం. డంపింగ్ యార్డును త్వరగా ఏర్పాటు చేసి రోడ్డు వెంట వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకుంటాం. వ్యర్థాలు రోడ్డు పక్కన వేయవద్దని దుకాణదారులకు అవగాహన కల్పిస్తాం.

- అంజనేయులు, ఎంపీవో, మఠంపల్లి

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జూలై 10: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు యలమంచమ్మ మృతి

గరిడేపల్లి, జూలై 10: మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు గడ్డం యలమంచమ్మ(83) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. వెలిదండలో యలమంచమ్మ మృతదేహంపై సీపీఎం మండల నాయకుడు యానాల సోమయ్య ఎర్రజెండా కప్పి నివాళులర్పించి మాట్లాడారు. భర్త లక్ష్మీనర్సయ్యతో కలిసి ఎలమంచమ్మ ఉద్యమ దళానికి ఎంతో సహాయ సహకారాలు అందించిందని తెలిపారు. ఈ దంపతులు తుది శ్వాస వరకు ఎర్రజెండాను వీడలేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నారని కొనియాడారు. యలమంచమ్మ మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, అంబటి భిక్షం, వీరయ్య, సైదయ్య, రామారావు, వెంకన్న, బ్రహ్మం, హుస్సేన్, సుధాకర్ తదితరులు నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చిలుకూరు,తిరుమలగిరి, జూలై 10: గ్రామాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి రూపేందర్‌సింగ్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిరిబాబు, ఏపీవో నిర్మల, పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య పాల్గొన్నారు.

● వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధం చేశామన్ని తిరుమలగిరి:మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు తెలిపారు. తిరుమలగిరి మునిసిపాలిటి పరిధిలోని నందాపురం తొమ్మిదో వార్డులో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెర్వు, జూలై 10: అక్రమంగా తరలిస్తున్న 18క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో రెండు ఆటోల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. రెండు ఆటోలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెఇలపారు ఎస్సై సైదిరెడ్డి తెలిపారు.

రెండు బైకులు, ఒక మోపెడ్ చోరీ

మునగాల రూరల్, జూలై 10: మండలంలోని బరాఖత్‌గూడెం, ముకుందాపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి రెండు బైకులు, ఒక మోపెడ్ చోరీ అయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన రెడ్డిపల్లి లక్ష్మణ్ రాజుకు చెందిన హీరో గ్లామర్ బైక్, ముకుందాపురం గ్రామం కుంచం రాజుకు చెందిన పల్సర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. అదేవిధంగా బరాఖత్‌గూడెంకు చెందిన మరో వ్యక్తి టీవీఎస్ ఎక్స్‌ఎల్ కూడా చోరీకి గురైంది. ఈ విషయమై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు.

కొమరబండ కేఎల్ఆర్ కాలనీలో..

కోదాడ రూరల్, జూలై 10: మండలంలోని కొమరబండ గ్రామంలోని కేఎల్ఆర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలంచర్ల రవీంద్రనాథ్ ఠాగూర్ 15రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇంటి తాళాలు ధ్వంసం చేసి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి విలువైన వస్తువులు, అర కిలోకు పైగా ఉన్న వెండి కంచాన్ని అపహరించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించడంతో పాటు వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. గతంలో వారం రోజుల వ్యవధిలో కేఎల్ఆర్ కాలనీలో నాలుగు ఇళ్లలో దొంగలు చోరీ చేసి రూ.2లక్షలకు పైగా విలువైన వస్తువులు అపహరించారు. చోరీలు జరగకుండా రాత్రివేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మురుగు నీరు నిల్వ ఉండనీయొద్దు

హుజూర్‌నగర్, జూలై 10: ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ కోరారు. బుధవారం మండలంలోని బూరుగడ్డలో రెండో రోజు ఇంటింటికీ వెళ్లి విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే విష జ్వరాలు రావన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి పుష్పలత, సీహెచ్‌ఓ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బూరుగడ్డలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్

బూరుగడ్డలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలి: సీపీఐ

హుజూర్‌నగర్ రూరల్: బూరుగడ్డలో విషజ్వరాలు అరికట్టేందుకు అధికారులు మెడికల్ క్యాంపును ఏర్పాటుచేయాలని సీపీఐ ప్రతినిధులు కోరారు. బుధవారం మండలంలోని బూరుగడ్డ గ్రామంలో విష జ్వరాలతో బాధపడుతున్న ప్రజనలు పరామర్శించారు. అనంతరం అక్కడ ఉన్న వైద్యులతో మాట్లాడి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. నెల రోజులుగా బూరుగడ్డలోని ప్రజలు డెంగీ మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలతో బాధపడుతున్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు సరైన పారిశుధ్య పనులు చేపట్టంలేదన్నారు. మురుగు చెత్తచెదారంతో నిండాయన్నారను. అధికారులు మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాస్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కనకయ్య, లింగయ్య, గోవింద్, నర్సింహ, వెంకటేశ్వర్లు, ఖాసిం, శ్రీను, వీరయ్య పాల్గొన్నారు.



బూరుగడ్డలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న సీపీఐ బృందం

మునగాల రూరల్: సీజనల్ వ్యాధులపై మండలంలోని తాడ్వాయి గ్రామంలో ప్రజలకు డాక్టర్ శ్రీశైలం అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండి దోమలు చేరుతాయన్నారు. దోమలు కుడితే మలేరియా, డెంగీఆ చికెన్ గున్యా జ్వరాలు రావడంతో పాటు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయని అన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవా లని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, హెచ్‌ఈవో షాబుద్దీన్, పీహెచ్ఎన్ శారద, ఎంపీహెచ్ఏ సుచరిత, లింగయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా నరేందర్ ఎన్నిక

హుజూర్‌నగర్, జూలై 10: హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్‌గా జక్కుల నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి పద్మ ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఉదయం 11గంటలకు జక్కుల నరేందర్ నామినేషన్ వేయగా, మిగిలిన సభ్యులందరూ ఆమోదించారు. ఇతరులు ఎవరూ నామినేషన్ వేయనందున నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా సహకార అధికారి పద్మ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కుల నరేందర్‌ను సింగిల్ విండో డైరెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, ఆడిటర్ అంబేద్కర్, వైస్ చైర్మన్ కంచర్ల మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లీశ్వరి, మల్లమ్మ, లక్ష్మి, పద్మ, శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, బ్రహ్మం, శ్రీనివాసు, శ్రీను, లచ్చీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌గా ఎన్నికైన జక్కుల నరేందర్, పాలకవర్గ సభ్యులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



నేరేడుచర్లలో సామూహిక శ్రీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్

నేరేడుచర్ల, అర్వపల్లి, జూలై 10: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సామూహిక శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పాపమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

●జాజిరెడ్డిగూడెం మండలం కోమటపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకుబుధవారం సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉల్లెందుల సైదులు, శివరంజిని, సృజన, బర్హాన, చైతన్య, మహాలక్ష్మి, కేతమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా వీరయ్య ప్రమాణ స్వీకారం

హుజూర్‌నగర్, జూలై 10: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంకు చెందిన ముత్తినేని వీరయ్య బుధవారం హైదరాబాద్‌లో దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, మధుయాష్కీగౌడ్ తదితరులు హాజరై వీరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వీరయ్యను సన్మానించిన కాంగ్రెస్ మండల నాయకులు

మఠంపల్లి: దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను మఠంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిసారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్‌ను పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నవీన్‌నాయక్, భాస్కర్‌నాయక్, రవినాయక్, సైదానాయక్, సుధాకర్ పాల్గొన్నారు.



వీరయ్యను అభినందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

జేఎల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు



వెంకటేశ్వర్లు

అర్వపల్లి, జూలై 10: జూనియర్ లెక్చరర్(జేఎల్) ఫలితాల్లో జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామానికి చెందిన తండు వెంకటేశ్వర్లు రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. వెంకటేశ్వర్లును తల్లిదండ్రులు సుశీల, రాములు కూలి పనులు చేసుకుంటూ చదివించారు, వెంకటేశ్వర్లు ప్రస్తుతం నాగారం గురుకుల జూనియర్ కళాశాలతో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2019లో టీజీటీ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.

సీనియర్ న్యాయవాది నర్సింహారెడ్డి మృతి



నర్సింహారెడ్డి ఫైల్ ఫొటో

హుజూర్‌నగర్, జూలై 10: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది గాయం నర్సింహారెడ్డి(90) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో తొలి తరం న్యాయవాదిగా నర్సింహారెడ్డి సుదీర్ఘ కాలం పనిచేశారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నర్సింహారెడ్డి తండ్రి సీతారాంరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పనిచేశారు. నర్సింహారెడ్డికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి అమెరికాలో చనిపోయారు. మూడో కుమారుడు హేమగిరిరెడ్డి అమెరికాలో నివసిస్తున్నారు.నర్సింహారెడ్డి మృతికి పలువురు కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

'ఆసరా పింఛన్ డబ్బులు పెంచి ఇవ్వాలి'

గరిడేపల్లి, జూలై 10: ఆసరా పింఛన్ డబ్బులను ప్రభుత్వం పెంచి ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ అబ్దుల్ సుభానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్‌ను రూ.4వేలకు పెంచాలని, అర్హులందరికీ పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడియాల అప్పయ్య, వెంకన్న, రమేష్, ఈశ్వరమ్మ, లింగయ్య, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

'నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

నేరేడుచర్ల, హుజూర్‌నగర్, జూలై 10: కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రాంమ్మూర్తి కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంమ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులందరికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాన్‌పహాడ్, మిర్యాలగూడ రోడ్డు ఆటో యూనియన్ అధ్యక్షులు శంభిరెడ్డి, ఎస్‌కే మీరా, నాయకులు నగేష్, మల్లేష్, భాస్కర్, సైదులు, మనోజ్ పాల్గొన్నారు.

● కార్మికుల హక్కులు కాపాడుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి ఎలక సోమయ్యగౌడ్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వెకార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, అంజయ్య, అశోక్, వీరస్వామి, సతీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలి'

చిలుకూరు, జూలై 10: సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిలుకూరులో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం సీపీఐ ప్రజా పోరాటాలు చేస్తుందని, ప్రాణత్యాగాలు చేసి హక్కులు సాధించుకున్న చరిత్ర సీపీఐకి ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆయన ఆరోపించారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి సాహెబ్‌అలీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు, మండవ వెంకటేశ్వర్లు, కొండా కోటయ్య, రెమిడాల రాజు, చేపూరి కొండలు, దొడ్డా వెంకటయ్య, నాయకులు సంద్యాల రాంరెడ్డి, పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



పెన్‌పహాడ్ తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రంఅందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), మఠంపల్లి, జూలై 10: కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ నాయకులు రణపంగి కృష్ణ, ధనియాకుల శ్రీనివాస్ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో పెన్‌పహాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుంజా వెంకటేశ్వర్లు, ఒగ్గు మట్టయ్య, ఎల్లమ్మ, నర్సయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

●గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని, ప్రభుత్వ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ యాతకుల వెంకన్న కోరారు. ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 'కార్మికుల కొర్కెల దినం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వీరన్న, మారపాక ముత్తయ్య, నవిలే వెంకన్న, బొప్పని కనకమ్మ, ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

● కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మఠంపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రన్‌మియా, ఇంటి రవి, షైసయ్య, జానీపాషా, దేవదానం, బాలశౌరి పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో పట్టణ టెంట్‌హౌజ్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసాల వెంకట్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా కట్కూరి ప్రేమసాగర్, కిశోర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా పాలగాని కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌బిన్ అబూబ్, కోశాధికారిగా మిడిసినమెట్ల మురళి, సహాయ కార్యదర్శిగా గోనె సందీప్, కార్యవర్గ సభ్యులుగా తాళ్లపల్లి సైదులుగౌడ్, నాగుబండి జీవన్‌కుమార్, కట్కూరి శేఖర్‌రెడ్డి, ఎండీ తాహెర్‌ను ఎన్నుకున్నారు.

హుజూర్‌నగర్: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్ కోరారు. పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఆరుగురు ఉపాధ్యాయినిలను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.రేణుక, పరిమళ, పద్మ, కల్పన, శాంతకుమారి, కవిత, రామనాథం జయప్రద పాల్గొన్నారు.

● విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసకావొద్దని సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ పశ్య శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జనచైతన్య ట్రస్ట్ సభ్యుడు పారా సాయినాయుడు, శివశంకర్ కోరారు. పట్టణంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు సులువ చంద్రశేఖర్ బీ-పాజిటివ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రమేష్, విశ్వనాథ్, సాయి, చంటి పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల రాంరెడ్డి, జక్కులవీరయ్య, రిటైర్డు లాయర్ కాల్వ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ హాజరై వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

● ఆషాఢ మాసం సందర్భంగా మఠంపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఆర్యవైశ్య మహిళ సంఘాల ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కుక్కడపు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా చేదెళ్ల స్వామి, కోశాధికారిగా వంగవేటి భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా కొత్త శ్యామల, వంగవేటి పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోదాడ రూరల్: మండలంలోని తమ్మర గ్రామ మాజీ సర్పంచ్, సామినేని వెంకటేశ్వర్లు మృతి గ్రామానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తొండపు సతీష్, సింగిల్ విండో చైర్మన్ నంబూరి సూర్యం అన్నారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వున్నం హనుమంతరావు, రాజు, ముత్తవరపు వీరయ్య, సూరి పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అంజపెల్లి వెంకటమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ మండబల వైస్ ప్రెసిడెంట్ పులిగిల్ల వెంకన్న పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కన్న వెంకటయ్య, వర్రె లింగయ్య, కన్న మల్లయ్య, బొబ్బిలి వీరసోములు, పులిగిల్ల లక్ష్మయ్య, పాల్గొన్నారు.

అర్వపల్లి: విద్యార్థులు ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. అర్వపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఎన్.గోపాల్, ఎ.పురుషోత్తం, ఎ.శ్రీధర్, సీహెచ్ గురుప్రసాద్, పీఈటీ ఎల్.రవి, పూసపల్లి వెంకన్న, బొల్లెద్దు శ్రీనును సన్మానించారు. కార్యక్రమంలో మధుకర్, శ్రీరాములు, వీరన్న, నాగయ్య, మేకల సునీత పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన జనగాం అవిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకుడు కుంభం సతీష్ పరామర్శించి 50కిలోల బియ్యం, రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, దూపటి రాములు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన్‌కల్: సీఎం రేవంత్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో అశోక్‌యాదవ్ మాట్లాడుతూ కిశోర్‌కుమార్ తన స్థాయిని మరచి సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది మొదట బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఈ సమావేశంలో కొలిచెల్మ తరుణ్, సాయిసిద్ధార్థ, సాయి, విజయ్‌కుమార్, సంపత్, మహేష్, అఖిల్, వేణు పాల్గొన్నారు.

నాగారం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఆదర్శ కమిటీలు చేపట్టాలని ఎంపీడీవో ధార శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఆదర్శ కమిటీల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి ఆదర్శ కమిటీలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బదిలీపై పాఠశాలలకు నూతనంగా వచ్చిన హెచ్‌ఎంలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముత్తయ్య స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రభాకర్ పాల్గొన్నారు.